ఆరు నెలల్లో గోస్తనీ నదిపై వంతెన పూర్తి



వంతెన నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- సెల్ఫీ ఛాలెంజ్ కాదు... బహిరంగ చర్చకు రండి
- టీడీపీ, జనసేన నాయకులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సవాల్



టి.నగరపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ఆరు నెలల్లో గోస్తనీ నదిపై వంతెన నిర్మాణం పూర్తి చేసి టి.నగరపాలెం ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం టి.నగరపాలెం గోస్తనీ నది వద్ద రూ.2.96 కోట్లతో చేపట్టనున్న వంతెన నిర్మాణానికి ఆయన ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత తాటితూరు, పాండ్రంగి వద్ద గోస్తనీ నదిపై రూ.16 కోట్లతో వంతెన నిర్మాణాలకు శ్రీకారం చుడతామన్నారు. తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టవలసి ఉందన్నారు. 1520 ఓట్లున్న ఈ పంచాయితీకి ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో రూ.7.64 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.2.97 కోట్ల అభివృద్ధి పథకాలు అందించిందన్నారు. అంటే ఒక్కో ఓటరుపై అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపంలో రూ.లక్ష వరకు ఖర్చు చేశామన్నారు. వంతెన నిర్మాణానికి సహకారం అందిస్తున్న దివీస్ యాజమాన్యం ఏడాది క్రితమే ప్రభుత్వం దగ్గర రూ.50 లక్షలు డిపాజిట్ చేసిందన్నారు. సాంకేతిక, కాంట్రాక్ట్ పనులకు సంబంధించిన లోపాల కారణంగా ఆలస్యమైందన్నారు. నియోజకవర్గంలో రూ.900 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అందచేశామని తెలిపారు.

టీడీపీ, జనసేన బహిరంగ చర్చకు రావాలి

సెల్ఫీ ఛాలెంజ్‌లతో పిచ్చిగా ప్రవర్తిస్తున్నవారు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై బహిరంగ చర్చలకు రావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. టీడీపీ, జనసేన వాళ్లు పిచ్చిపట్టినట్టు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కాలర్ ఎగరేసుకుని తిరగాలన్నారు. వారికి అండగా సీఎం జగన్ ఉన్నారన్నారు. దివీస్ లేబొరేటరీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని కోరారు. భోగాపురంలో 4,500 ఎకరాల్లో నిర్మించనున్న అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు, వేలాది మందికి ప్రత్యక్షంగా, లక్షలాది మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా భీమిలి నియోజకవర్గంలో 130 ఎకరాల్లో టెక్నో పార్కు ఏర్పాటుకు ఈ నెల 3న సీఎం జగన్ మోహన్‌రెడ్డి భూమిపూజ చేస్తారన్నారు. ప్రజల నాడినిబట్టి 2024లో జగన్ మళ్లీ సీఎం అవుతారన్నారు. ఆయనకు ప్రజాబలం మెండుగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమి, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు చెల్లూరి పైడప్పడు, పల్ల నీలిమ, సమ్మిడి శ్రీను, గాడు వెంకటనారాయణ, చెల్లూరి నగేష్, పాట్నూరు చంద్రశేఖర్, పల్ల సన్యాసిరావు, వెంపాడ సూరిబాబు, ఉండబట్ల వెంకట అప్పారావు, దివీస్ ప్రతినిధులు వరహాలరెడ్డి, నాగరాజు, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

జమ్మిచెరువు వాకర్స్ క్లబ్ ఏర్పాటు



శ్యాంసుందర్ దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు సమీపంలోని జమ్మిచెరువు పార్కు వద్ద ఆదివారం కొత్తగా జమ్మిచెరువు వాకర్స్‌క్లబ్ ఏర్పాటైంది. ఇందులోని సభ్యులు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని భావించి క్లబ్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యానికి కలిగే మేలుపై అందరికీ అవగాహన కల్పిస్తామని తెలిపారు, ఈ సందర్భంగా విశ్రాంత పోలీస్ శ్యాంసుందర్ దంపతులను, సీనియర్ న్యాయవాది ఎస్.జనార్ధనరావును సత్కరించారు. దత్తి ఈశ్వరరావు, లక్ష్మీనారాయణ, నల్లి అప్పలనాయుడు, కృష్ణారావు, ముమ్మిడిశెట్టి సునీల్, జోగారావు, హేమంత్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తాపడి యువకుడి దుర్మరణం

తగరపువలస: రాజాపులోవ – రాయ్‌పూర్ జాతీయ రహదారిపై భీమిలి మండలం దాకమర్రి తాజుద్దీన్ బాబా ఆశ్రమం రహదారి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నమ్మి రాంబాబు(23) అనే యువకుడు మృతి చెందాడు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస పంచాయితీకి చెందిన రాంబాబు, లొడగల వెంకటేష్ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తూ వాహనం జారి బోల్తాపడడంతో కింద పడ్డారు. ఈ ప్రమాదంలో రాంబాబు తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న వారి బంధువు అలబోయిన రాజేష్ సంగివలస అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించగా రాంబాబు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి ఆరిలోవ అపోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుని తండ్రి నారాయణప్పడు ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్సిడీ రుణాల పేరుతో మధ్యవర్తుల దోపిడీ

తగరపువలస: సబ్సిడీ రుణాల పేరుతో చిరు వ్యాపారులను మధ్యవర్తులు దోచుకుంటున్నారు. వీరికి కొన్ని బ్యాంకులకు చెందిన సిబ్బంది సహకారం అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న వివిధ పథకాలకు సంబంధించి రూ.15 లక్షల వరకు రుణాలు అందిస్తామని, అందులో రూ.3.50 లక్షల సబ్సిడీ ఉంటుందని, అందువల్ల తమ వాటా అడిగి తీసుకుంటున్నారు. ఈ వాటా కింద రూ.80వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. కొత్తగా వ్యాపారాలు పెట్టకపోయినా కొనసాగుతున్న వ్యాపారాలకు సైతం బ్యాంకు అధికారులకు తాము ఎంత చెబితే అంతని అంటున్నారు. వ్యాపారానికి సంబంధించి ఏవైనా వస్తువులు కొన్నట్టు ఎస్టిమేషన్ బిల్లులు ఇస్తే సరిపోతుందని నమ్మిస్తున్నారు. వ్యాపారులు వ్యక్తిగతంగా రుణాల కోసం సంప్రదిస్తే ముప్పుతిప్పలు పెట్టే బ్యాంకు అధికారులు మధ్యవర్తులకు మాత్రం రాచమర్యాదలు చేసి వారు ఆడించినట్టు ఆడుతూ పాడించినట్టు పాడుతున్నారు. దీంతో వ్యాపారులు రుణాల పేరుతో వ్యాపారం జరగకముందే లక్షలాది రూపాయలు బ్రోకరేజీ రూపంలో కోల్పోతున్నారు. ఇటీవల దివీస్ లేబొరేటరీలో కాంట్రాక్టర్ వద్ద పనిచేసిన ఒకరు ఈ మధ్యవర్తి అవతారం దాల్చి పలువురు వ్యాపారులను మభ్యపెడుతున్నాడు. ఈ వ్యాపారం ద్వారా కష్టపడకుండా రూ.లక్షలు వస్తుండటంతో కాంట్రాక్టర్ వద్ద పనికి వెళ్లడం మానేశాడు. స్థానికంగా ఉన్న ఒక వ్యాపారి బ్రోకరేజీ ఇవ్వనందున సదరు బ్యాంకు సిబ్బందిని పరిచయం చేయనని, అసలు బ్యాంకు నుంచి సబ్సిడీ రుణం ఎలా తీసుకుంటావని బెదిరించాడు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి



ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

భీమునిపట్నం: భీమిలిలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద అమ్మవారి జయంతి ఉత్సవం ఆలయ కమిటీ అధ్యక్షుడు బొండ నర్సింహమూర్తి పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి పంచామృత, ఫలాభిషేకాలు, ప్రత్యేక పూజలు, సామూహిక సహస్ర కుంకుమార్చన చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనకు భక్తులు తరలివచ్చారు.

తప్పిన పెను ప్రమాదం



రోడ్డు మధ్యలో బోల్తా పడిన ఆటో

కొమ్మాది: బీచ్ రోడ్డులో ఆటోను లారీ ఢీకొట్టింది. ఆదివారం సాయంత్రం వైజాగ్ నుంచి భీమిలి వైపు వెళ్తున్న ఆటోను అదే దారిలో వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో రోడ్డు మధ్యలో ఆటో బోల్తాకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రామలక్ష్మి సేవలకు సత్కారం



శీరపు రామలక్ష్మిని సత్కరిస్తున్న జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ప్రతినిధులు

తగరపువలస: ఏడేళ్లుగా సామాజిక సేవలు అందిస్తున్నందుకు తగరపువలసకు చెందిన మానవ హక్కుల విపత్తు శాఖ అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మిని ఆదివారం నగరానికి చెందిన జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్, వరాహ వేంకటేశ్వర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు సత్కరించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో 2023 సంవత్సరానికి సేవామార్గంలో ఉన్న 50 మందిని గుర్తించి ఈ సత్కారం అందించారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ఉత్సాహం చూపుతానన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి సన్మానం



హరిణిని సన్మానిస్తున్న వెల్లంకి గ్రామస్తులు

ఆనందపురం : మండలంలోని వెల్లంకి ఎస్సీ కాలనీకి చెందిన విద్యార్థిని ఉప్పాడ హరిణి ఇంటర్మీడియట్ పరీక్షల్లో 932 మార్కులు సాధించడంతో గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. పేద కుటుంబానికి చెందిన హరిణి నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో చదువుతూ బైపీసీ గ్రూపులో మంచి మార్కులు సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సత్కరించి ప్రోత్సాహకాలు అందజేశారు. ఉన్నత చదువులకు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాకర వెంకట రమణ, పిన్నింటి వెంకట రమణ, కంటిమహంతి చంద్రమౌళి, పడాల రాము, కొర్రాయి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎర్నిమాంబ ఓడ మహోత్సవం



ఎర్నిమాంబ ఆలయంలో పూజల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్ జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట శ్రీ ఎర్నిమాంబ ఓడ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఓడను ఉప్పాడ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు పాల్గొన్నారు. సాయంత్రం మంగమారిపేట గ్రామంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నారాయణకు ఘన నివాళి



నారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గాడు శ్రీను తండ్రి నారాయణ చిత్రపటానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం నివాళులర్పించారు. శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో జరిగిన కార్యక్రమంలో శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుభుక్త రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, కంటుబోతు రామానాయుడు, కేపీ సత్యనారాయణ, గాడు సన్యాసప్పడు, మద్దిల వెంకటరమణ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులు రాణించేందుకు కృషి

తగరపువలస: వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా వారు రాణించేలా తాము కృషి చేస్తున్నట్టు శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక క్యాంపస్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నీట్, ఐఐటీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డే స్కాలర్ల కన్నా రెసిడెన్షియల్ విద్యార్థులు ఉన్నత ర్యాంకులు, మార్కులు సాధిస్తున్నారన్నారు. వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ తమ విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేలా చూసుకుంటామన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మేకా క్రాంతిసుధ, బూరుగుపల్లి రాధారాణి, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



గ్రేడింగ్ పోటీల్లో బెల్ట్‌లు సాధించిన విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలిలోని సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం షాడో షోటోకాన్ కరాటే డూ అసోసియేషన్ చీఫ్ కోచ్ ముగడ వెంకటరమణ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. 80 మంది విద్యార్థులు పాల్గొనగా 35 మంది ఎల్లో బెల్ట్ సాధించారు. అలాగే 10 మంది ఆరెంజ్ బెల్ట్, ముగ్గురు బ్రౌన్ బెల్ట్‌లు, ముగ్గురు మెరూన్ బెల్ట్‌లు, ముగ్గురు గ్రీన్ బెల్ట్‌లు, ఇద్దరు బ్లూ బెల్ట్‌లు సాధించారు. ఈ సందర్భంగా బెల్టులు సాధించిన వారికి అసోసియేషన్‌కు సహకారం అందిస్తున్న అక్కరమాని మంగరాజు, కళింగరాజు, డాక్టర్ ముమ్మిశెట్టి ఆదిత్య ధ్రువీకరణ పత్రాలు అందించారు. సీనియర్ మాస్టర్స్ ఉమ్మిడి నర్సింగ్, కె.శివ, కె.దేవేంద్ర పాల్గొన్నారు.

స్వతంత్రనగర్‌లో అన్నసంతర్పణ

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డుల పరిధి స్వతంత్రనగర్‌లోని లక్ష్మీ దేవమ్మ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకటరావు, నక్కాన శ్రీధర్ తదితరులు ప్రారంభించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వతంత్రనగర్, మధురవాడ పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కొత్తాల శ్రీను, దిబ్బ శ్రీను, దాది గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలి



బాధితుడిని పరామర్శిస్తున్న కార్పొరేటర్ గంగారావు, తదితరులు

మధురవాడ: కిడ్నీ దొంగల ముఠాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని బాధితుడు వినయ్ కుమార్‌కు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. మధురవాడ వాంబేకాలనీలో బాధితుడి ఇంటికి ఆదివారం వెళ్లి పరామర్శించారు. వినయ్‌కుమార్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని, అలాగే కుటుంబం తీవ్ర పేదరికంతో దయనీయ స్థితిలో ఉందని, వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ముఠా సభ్యులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మధురవాడ జోన్ నాయకులు పి.రాజ్‌కుమార్, సీపీఎం నాయకులు డి.అప్పలరాజు పాల్గొన్నారు.

అనంతుని ఘాట్ రోడ్డు పరిశీలన



అనంతుని ఘాట్ రోడ్డులో పులి జాడలు పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

పద్మనాభం: పద్మనాభంలోని అనంతుని ఘాట్ రోడ్డుపై పులి జాడలు ఉన్నాయేమోనని అటవీ శాఖ అధికారులు ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతుని ఘాట్ రోడ్డుపై పులి సంచరిస్తుందని స్థానికులు శనివారం అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పద్మనాభం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అటవీ శాఖ అధికారులు అనంతుని కొండ ఘాట్ రోడ్డు, కొండ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇక్కడ పులి జాడలు లేవని అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. దీంతో భక్తులు, అర్చకులు ఊపిరి పీల్చుకున్నారు.

నేటి నుంచి కరాటేలో ఉచిత శిక్షణ

భీమునిపట్నం: పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం నుంచి జూన్ 10 వరకు ఉచిత వేసవి కరాటే శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు చీఫ్ కోచ్ ఎం.రమణయాదవ్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 7 : 30 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు వివరాలకు 9030557785లో సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కాళింగనర్తన నృత్యాంశంలో కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి జానపద నృత్యాల ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను రంజింపజేసింది. హైదరాబాద్ టీఎస్ కళాసమితి కళాకారులు వినూత్న నృత్య రీతులతో ఆకట్టుకున్నారు. కళాకారులు తపస్విని, వర్షామృత, సోని, అనన్య, హిమసుధ, చిన్మయ, దివ్య, రేవతి, కళ్యాణిసాయి తదితర కళాకారులు పాల్గొనగా కల్యాణి భవ్య సాయి నృత్య దర్శకత్వం వహించారు. శాంతకుమారి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

శుద్ధ ఏకాదశికి ఏర్పాట్లు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో సోమవారం శుద్ధ ఏకాదశికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఐదు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలుపుతారు. ఐదున్నర గంటలకు పంచామృత అభిషేకాలు, తదుపరి నిత్య పూజలు చేస్తారు. భక్తులు స్వామి వారి అభిషేకంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామాంజనేయస్వామి కోరారు.

లక్ష్య సాధనకు పట్టుదల అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు

ఆనందపురం: విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే పట్టుదలతో ముందుకు సాగాలని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు సూచించారు. మండలంలోని గొట్టిపల్లి ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలతోపాటు పరిసరాలను అవగాహన చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి పలు పథకాలను అమలుచేస్తూ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవడానికి పదో తరగతి తొలి మెట్టు అని, అందులో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో బోధన చేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇల్లాపు వెంకటరావు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా జగదీశ్వర రావు, పాఠశాల హెచ్‌ఎం రుత్తల సన్యాసిరావు, చైర్మన్ వెన్ని నారాయణరావు, సత్యసాయి ఆదర్శగ్రామం కోఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా ప్రజాప్రతినిధులకు సత్కారం



టి.నగరపాలెం సర్పంచ్, ఎంపీటీసీ సభ్యురాలిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ఇటీవల రాష్ట్ర స్థాయిలో గుడ్ గవర్నన్స్ విభాగంలో టి.నగరపాలెం పంచాయతీ రెండోస్థానం సాధించడానికి కారణమైన సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు పల్ల నీలిమను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలైనా వివిధ విభాగాలను సమన్వయం చేసుకుంటూ జిల్లా స్థాయిలో కూడా పంచాయతీకి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారని కొనియాడారు.